క్లుప్తంగా

నృసింహుడి సన్నిధిలో ఏఎస్పీ పూజలు



ధర్మపురి దేవస్థానంలో ఏఎస్పీ శేషాద్రిరెడ్డి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఆదివారం వేములవాడ అసిస్టెంట్ ఆఫ్ సూపరింటెండెంట్ పోలీస్ శేషాద్రిరెడ్డి స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం ఆధ్వర్యంలో సాంప్రదాయంగా స్వాగతం పలికారు. సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్ర పటం, ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఎస్సై మహేశ్, ఆలయ అర్చకులు నంబి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ సెంటర్లలో కమిషనర్ తనిఖీ



తనిఖీ చేస్తున్న కమిషనర్ జగదీశ్వర్ గౌడ్

రాయికల్: పట్టణంలోని చికెన్ సెంటర్లలో ఆదివారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించని, నిల్వ ఉంచిన చికెన్ అమ్ముతున్న పలు చికెన్ సెంటర్లకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చికెన్ సెంటర్ల యజమానులు పరిశుభ్రత పాటించాలని, నిల్వ ఉంచిన చికెన్ అమ్మరాదని సూచించారు.

పశువైద్యశాలకు మరమ్మతు చేయించాలి



వైద్యశాలను పరిశీలిస్తున్న వసంత

జగిత్యాలరూరల్: వెల్దుర్తి గ్రామంలోని పశువైద్యశాలను వెంటనే మరమ్మతు చేయించాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తిలో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 ఏళ్ల నాటి పశువైద్యశాల శిథిలావస్థకు చేరిందని, వెంటనే మరమ్మతు చేపట్టి పశువైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సాగర్‌రావు, నాయకులు బుర్ర ప్రవీణ్, ఆనందరావు, శేఖర్, సదాశివరావు, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి: మూఢ నమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. పట్టణంలోని బిస్మిల్లా మసీదులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఖాత్ మే నభువత్ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఇందులో పలువురు మత పెద్దలు పాల్గొని ప్రసంగించారు. మూఢ నమ్మకాలతో ఎక్కువ మోసాలు జరుగుతున్నాయని, వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే తల్లిదండ్రులను ప్రేమించాలని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ వర్క్‌షాప్‌కు ఉమ్మడి జిల్లా నలుమూలాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న దాత శివశంకర్

జగిత్యాలజోన్: ఎంబీబీఎస్ సీటు సాధించిన గిరిజన విద్యార్థినికి జగిత్యాల పట్టణానికి చెందిన సామాజిక సేవకులు ఆదివారం రూ. 15 వేల ఆర్థికసాయం అందజేశారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన మానేపల్లి శిరిషా తల్లితండ్రులతో పాటు కోళ్ల ఫారంలో పనిచేస్తూ, ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమె వైద్య చదువుకు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయంటూ సాక్షిలో కథనం రావడంతో, సూరజ్ శివశంకర్ స్పందించి రూ. 10 వేలు, అలిశెట్టి గీతారాణి రూ 2 వేలు, మరో దాత రూ 3 వేలు విరాళం ఆమె గ్రామానికి వెళ్లి అందజేశారు.

ఏళ్లుగా ఎదురుచూపులే..

- కలగానే వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు
- ఏళ్లుగా ఎదురుచూపులే..
- ఉమ్మడి మండలంలో 25 వేల ఎకరాల్లో పంటల సాగు



సారంగాపూర్ వ్యవసాయశాఖ కార్యాలయం

సారంగాపూర్: జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలు వ్యవసాయ సాగులో ప్రధానంగా ఉన్నాయి. ఈ రెండు మండలాలను కలిపి వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని ఆయా మండలాల రైతులు ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయినప్పటికీ దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు జరిగే విధంగా ప్రభుత్వానికి నివేదించాలని భావిస్తున్నారు...

వాణిజ్య పంటలు అమ్ముకోవడానికి..

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 25 వేల ఎకరాలకు పైగా పంటలకు రైతులు సాగుచేస్తున్నారు. ప్రధానంగా వరిసాగు, ఆ తరువాత పత్తి, మిర్చి, మొక్కజొన్న, పసుపు పంటలు సాగవుతాయి. రైతులు వరి సాగు చేయడంతో వచ్చిన పంటను నేరుగా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు. ఇతర ఆరుతడి పంటలతో పాటు, వాణిజ్య పంటలు సాగుచేసిన సమయంలో వాటిని అమ్మడానికి ధర్మపురి మార్కెట్‌కు లేదా జగిత్యాల మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తుంది. దీంతో రైతులకు శ్రమ అధికం కావడంతో పాటు పంట రవాణా చార్జీలు తడిసిమోపడవుతున్నాయి.

జగిత్యాల వ్యవసాయ మార్కెట్ అనుకూలమే..

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు జగిత్యాల వ్యవసాయ మార్కెట్ అనుకూలం. కానీ ఈ రెండు మండలాలు మొదటి నుంచి ధర్మపురి వ్యవసాయ మార్కెట్‌లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీను నియమించగా సారంగాపూర్ మండలం నుంచి ఒకరిని, బీర్‌పూర్ మండలం నుంచి ఒకరిని డైరెక్టర్లుగా నియమించింది. వ్యవసాయానికి అనుబంధంగా రెండు మండలాల్లో నాలుగు సింగిల్‌విండోలు, నాలుగు రైతువేదికలు, గణేశ్‌పల్లిలో గోదాము ఉంది. సారంగాపూర్ మండలంలోని 18 గ్రామాలు, బీర్‌పూర్ మండలంలోని 17 గ్రామాల రైతులు ఆరుతడి, వాణిజ్య పంటలను పండిస్తే, వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి జగిత్యాల మార్కెట్‌కు తీసుకవస్తున్నారు. వ్యవసాయ మార్కెట్లు దూరంగా ఉండడంతో ఎప్పుడైనా రైతులకు గిట్టుబాటు ధరల్లో వ్యత్యాసం కనిపిస్తే, తక్కువ ధరకే పంటలను విక్రయించుకుని రావాల్సిన పరిస్థితి నెలకొంది, కొన్నిసార్లు మిర్చి, పసుపు పంటలను నాగపూర్, నిజామాబాద్ వంటి దూరప్రాంతాలకు తీసుకువెళ్తున్నారు. వీటిని అధిగమించడానికి బీర్‌పూర్, సారంగాపూర్ రెండు మండలాలకు అందుబాటులో ఉండేవిధంగా వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ మార్కెట్‌తో రైతులకు మేలు



వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రైతులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. దీనిపై గత ప్రభుత్వం దృష్టిసారించలేదు. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తుందని రైతులు నమ్మకం. రెండు మండలాలకు అనుగుణంగా ఒక్క వ్యవసాయమార్కెట్‌ను ఏర్పాటు చేస్తే రైతులు తమ పంటలను అమ్ముకోవడానికి సరైన ధర లభిస్తుంది, దీంతో రైతులు సంతోషంగా ఉంటారు.

– పొల్సాని నవీన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్, కొల్వాయి

ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వస్తే పంపిస్తాం



సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ధాన్యం అమ్ముకోవడానికి రైతులకు ప్రతి గ్రామానికి ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ఉంది. ఇతర వ్యవసాయ ఉత్పత్తులను రైతులు ఇప్పటి వరకు తమకు అనుగుణంగా జగిత్యాల, ధర్మపురి మార్కెట్లకు తీసుకువస్తున్నారు. ప్రభుత్వం రైతుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తే దీనికి అనుగుణంగా ప్రతిపాదనలు పంపిస్తాం.

– తిరుపతినాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, జగిత్యాల



కథలాపూర్: మండలంలోని తుర్తి గ్రామంలో చెత్త సేకరణ కోసం పంచాయితీరా జ్‌శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన రిక్షాలు నిరుపయోగంగా మారాయి. గ్రామపంచాయితీ అధికారులు చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నప్పటికి... ఇరుకు రోడ్డు ఉన్న వాడల్లోకి ట్రాక్టర్లు వెళ్లడం లేదు. అధికారులు చొరవ చూపి చెత్త సేకరణకు కొనుగోలు చేసిన రిక్షాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్,ఎంపీవో, కథలాపూర్, సెల్ నంబర్: 9640807073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

మల్యాల: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల తహసీల్దార్ మునీందర్ అన్నారు. మల్యాల, ముత్యంపేట గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండి ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, బూత్ లెవల్ ఆఫీసర్లు సైతం వారి పరిధిలో ఓటరుగా నమోదు చేసుకోని వారిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం పలు గ్రామాల్లో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు.మార్పులు,చేర్పులు తప్పొప్పులు ఉంటే ఓటర్ల జాబితాలో సవరించాలని బీఎల్‌వోలకు సూచించారు.

ప్రైవేట్ ఆస్పత్రి వద్ద మృతుడి బంధువుల ఆందోళన

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. మేడిపల్లి మండలంలోని కమ్మరిపేటకు చెందిన జలేందర్(30) అనే యువకుడు జ్వరంతో మెట్‌పల్లిలోని ఓ ఆస్పత్రిలో శనివారం చేరాడు. అదే రోజు అతని పరిస్థితి విషమించడంతో మరో ఆసుపత్రికి తీసుకవెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతి చెందాడని చెప్పారు. దీనికి ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యంతో శాంతించి ఆందోళన విరమించారు.

మెడికల్,ఇంజనీరింగ్ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రభుత్వ విప్

గొల్లపల్లి: మెడిసిన్, ఇంజనీరింగ్ విభాగంలో సీట్లు సాధించిన గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దంపతులు అభినందించారు. ప్రభుత్వ కళాశాలలో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాదించిన కట్కూరి మహేందర్, ఇంజనీరింగ్‌లో సీటు సాదించిన నల్ల పల్లవి, కొడిపెల్లి సోని, మద్దెల నరేందర్,బుర్ర వనీత, పొలాస చైతన్యను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లయ్య, అధ్యాపకులు బాలరాజు, తిరుపతి, లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థికసాయం

మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన కట్కూరి మహేందర్ అనే విద్యార్థి నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించగా, అతడి ఆర్థిక పరిస్థితి చూసి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంతకుమారి ట్యూషన్ ఫీజు నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

సాక్షి స్పందన

పెగడపల్లి: మండల కేంద్రంలోని ఎగ్గలకుంట ప్రాంతంలో ఏళ్ల క్రితం కస్తూర్బా పాఠశాల భవనం నిర్మించారు. అయితే ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి పాఠశాల వరకు సిమెంట్ రోడ్డు లేక పోవడంతో మట్టి రహదారిపై రాకపోకలు సాగిస్తుండటంతో సిబ్బంది, విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని ఇటీవల సాక్షిలో వార్త ప్రచురితమైంది. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన విప్ ఈజీఎస్ నుంచి రూ.12 లక్షలు మంజూరు చేయించారు. సీసీరోడ్డు కోసం నిధుల మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ విప్, సాక్షికి కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

పొరపాట్లకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న డీపీవో రఘువరన్

జగిత్యాలటౌన్: పొరపాట్లకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ ఎన్యుమరేట్లను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లో ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ సర్వే సరళిని పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. సర్వే నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో వాసవి, పంచాయతీ కార్యదర్శి అజయ్‌కుమార్ ఉన్నారు.

ఎన్యూమరేటర్లకు యజమానులు సహకరించాలి

ఇబ్రహీంపట్నం: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ఇంటి యజమానులు సహకరించాలని ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా కుటుంబ యజమాని చెప్పిన విధంగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

సారంగాపూర్: సమగ్ర కుటుంబ సర్వే ఆదివారం కొనసాగింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో సర్వే కార్యక్రమాన్ని మండల అధికారులు పర్యవేక్షించారు. మండలంలోని పెంబట్ల గ్రామంలో ఎంపీడీవో ఇంటింటికీ వెళ్లి పంచాయతీ కార్యదర్శులు, ఎన్యూమరేటర్లతో కలిసి సర్వే జరిపారు. ప్రజలు సర్వేకు సంపూర్ణంగా సహకరిస్తున్నారని ఎంపీడీవో తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: మండలంలోని నాగునూర్ గ్రామానికి చెందిన బొల్లారపు సుమన్ అనే వ్యక్తిపై ఆదివారం దాడికి పాల్పడ్డ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం సుమన్‌కు మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన పల్లపు విజయ్ మధ్య ద్విచక్రవాహనం విషయంలో గతంలో గొడవ జరిగింది. పెంబట్ల గ్రామంలో ఒకరికొకరు తారసపడడంతో సుమన్‌పై విజయ్ తన చేతి బ్రాస్‌లెట్‌తో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు విజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తమ్ముడిపై అన్న దాడి.. కేసు నమోదు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో ఆదివారం తమ్ముడిపై అన్న దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై గజేందర్ కథనం ప్రకారం కొల్వాయి దుంపేట సత్తన్న అన్న దుంపేట లస్మయ్యల మధ్య భూవివాదం ఉంది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని లస్మయ్య సత్తెన్నపై దాడి చేయడంతో సత్తెన్నకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు లస్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురి అరెస్టు

గొల్లపల్లి: మండలంలోని చందోళి గ్రామ శివారులో కోళ్ల పందాలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గ్రామ శివారులో కోళ్ల పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి కోళ్ల పందాల స్థావరం పై దాడులు చేశారు. వారిని పట్టుకునే క్రమంలో కొందరు పారిపోగా నలుగురు వ్యక్తులు దొరికారు. వారిని అరెస్టు చేసి రూ.6200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1998-2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



సమావేశమైన బొమ్మెన జెడ్పీహెచ్ఎస్ 2005-06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ పాఠశాల 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కోరుట్ల రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1998–2001 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర ఆలయ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 23 ఏళ్ల తరువాత కలుసుకున్న చిన్న నాటి స్నేహితులందరూ ఒకే చోట చేరి ఒకరి యోగ క్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెన జెడ్పీ హైస్కూల్లో 2005–06 పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. ఆనాటి జ్ఞాపకాలను విద్యార్థులు జ్ఞాపకం వేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ చైర్మన్ ఆనంద రెడ్డి, అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్ పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు.ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.తమ పాత మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు మీదకు రాకుండా మార్కింగ్

ధర్మపురి: దైవ దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా మార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆలయం నుంచి నంది కూడలి వరకు వర్తకుల దుకాణాల ముందు మార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. దేవాలయం సమీపంలో ఉన్న దుకాణదారులు తమ తమ సామగ్రిని రోడ్లపైకి పెట్టడంతో భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అందుకే మార్కింగ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మార్కింగ్ లోపల తమ సామగ్రిని సర్దు కోవాలని సూచించారు. మార్కింగ్ బయటకు సామగ్రి పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న డేరాలతో సీసీ కెమెరాలకు అంతరాయం ఏర్పడుతుందని వాటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

అశోక్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన పాలకుర్తి అశోక్ అనే గల్ఫ్ కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పాలకుర్తి అశోక్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్ లో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవడం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని గుర్తు చేశారు. కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అయోధ్యలో పాకాల శ్రీ వర్ధన్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల గౌడ సంఘం నాయకులు బొంగని భూమా గౌడ్, కైరిముత్తయ్య గౌడ్, పాలకుర్తి రవి గౌడ్, వెంకన్న గౌడ్, కొత్తకొండ లింగం గౌడ్,మోత్కురి కిష్టయ్య గౌడ్ వేణు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలు



పెగడపల్లి: కార్తీక మాస పూజల్లో భాగంగా ఆదివారం రాజన్న ఆలయ అర్చకులు గుండి అరుణ ఆధ్వర్యంలో మహిళలు వనభోజ నాలకు తరలివెళ్లారు. ఉసిరిచెట్టు వద్ద పూజలు జరిపిన అనంతరం దీపాదానం చేశారు. అనంతరం దేవునికి నైవేద్యం సమర్పించి అందరూ కలిసి ఉసిరిక, బిల్వ తదితర వృక్షాల నీడలో సాముహిక భోజనాలు చేసి సందడి చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జగిత్యాలటౌన్: విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పీడీఎస్‌యూ విద్యార్థి అమరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశంలోని దళిత,గిరిజన, బడుగు, బలహీన వర్గాల పేద విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా యూజీసీ ఫెలోషిప్స్ అందించకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా కాషాయీకరణ చేసి కుల,మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా పోరాటం చేసి అమరులైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, దుస్సా చేరాలు, మారోజు వీరన్నల స్ఫూర్తిగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోక్షిత్, రఘు, మహేష్, వంశీ, కిరణ్ పాల్గొన్నారు.